www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 2 సంచిక -193 మంగళవారం 24 సెప్టెంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,70306545

## కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతోనే దాడులు



ఏపీని చూసి పోలీసులు మేల్కొనాలి
ప్రభుత్వం మారాక అక్కడ పోలీసు అధికారుల గతి ఏమైందో చూస్తున్నారుగా!
చట్టాన్ని అతిక్రమిస్తే అంతే!
పోలీసులను తీవ్రంగా హెచ్చరించిన హరీశ్‌రావు
దాడి చేసినవారిని తక్షణం అరెస్ట్ చేయాలి: హరీశ్
దాడులతో మా స్థైర్యాన్ని దెబ్బతీయలేరు: కేటీఆర్
రాష్ట్రంలో బీహార్, రాయలసీమ పరిస్థితులు
గోమారంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

పోలీసు తాము శాశ్వతమని అనుకోవద్దని, పొరుగు రాష్ట్రం ఏపీని చూసైనా నేర్చుకోవాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హితవు పలికారు. రాష్ట్రంలో గూండా రాజ్యాన్ని తలపించేలా కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని, తెలంగాణకున్న మంచి పేరును మంటగలిపి తెలంగాణను బీహార్‌లా మారుస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

2లో.

# ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు

**రేషన్ పంపిణీ, సంక్షేమ పథకాలన్నీ దీని ద్వారానే అమలు**

ప్రయోగాత్మకంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక పట్టణం, ఒక గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పంపిణీ
సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



**హైదరాబాద్ సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:** రాష్ట్రంలో రేషన్ పంపిణీతోపాటు ఆరోగ్య తదితర సంక్షేమ పథకాలన్నింటినీ ఒకే కార్డు ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందుకోసం అన్ని కుటుంబాలకు డిజిటల్ కార్డులు ఇవ్వాలని యోచిస్తున్నది. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం తన నివాసంలో వైద్యారోగ్య, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజస్థాన్, హర్యానా, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే ఇలాంటి కార్డులు ఇచ్చినందున వాటివల్ల కలుగుతున్న లాభనష్టాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. ప్రయోగాత్మకంగా తెలంగాణలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణాన్ని, ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఫ్యామిలీ డిజిటల్ కార్డులను అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఉండాలని, వాటితో లబ్ధిదారులు ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా వీలుకల్పించాలని సూచించారు.

మిగతా 2లో.



2లో.

రేవంత్ రెడ్డి మోసాన్ని బయటపెట్టినందుకు

## కాంగ్రెస్ సీనియర్లు అభినందించారు

తెలంగాణ బీజేపీ నేతలు మాత్రం మౌనంగా ఉన్నారని ప్రశ్న
రేవంత్ రెడ్డి, బీజేపీ నేతల మధ్య అద్భుతమైన ప్రేమకథ నడుస్తోందని చురక
అమృత్ టెండర్లలో ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందన్న కేటీఆర్

## ఆరు వారాల్లోగా

### ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించాలి

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశం
బాధితుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి
వారంలోపు అభ్యంతరాలు చెప్పాలని బాధితులకు సూచన



**హైదరాబాద్ సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:** దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని బాధితుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్‌లోని దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ శాస్త్రీయంగా జరగలేదని పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపైతెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది.విచారణ సందర్భంగా... బాధితుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వారంలోపు చెరువుల పరిరక్షణ కమిటీ ముందు హాజరై అభ్యంతరాలను చెప్పాలని బాధితులకు కూడా సూచించింది. ఆరు వారాల్లోగా ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించాలని హైకోర్టు ఆదేశించింది.ఈ క్రమంలో, ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించే వరకు ఎలాంటి కూల్చివేతలు చేపట్టబోమని జీహెచ్ఎంసీ తెలిపింది. రికార్డుల ప్రకారం దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 65 ఎకరాలు మాత్రమే ఉందని, అధికారులు మాత్రం 160 ఎకరాలు అంటున్నారని, ఇది సరైనది కాదని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు.

## గాంధీ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

బిఆర్ఎస్ బృందాన్ని అడ్డుకున్న పోలీసులు
ఆస్పత్రిలో వసతుల పరిశీలనకు వెళ్లిన టీమ్
పోలీసుల తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్



**హైదరాబాద్ సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:** హైదరాబాద్ గాంధీ దవాఖాన వద్ద తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. దవాఖానలో పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకున్నది. మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్యతోపాటు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, మాగంటి గోపీనాథ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించారు. పోలీసు వాహనాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించారు.గాంధీ సహా రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల అధ్వాన పరిస్థితిని అధ్యయనం చేసేందుకు రాజయ్య నేతృత్వంలో బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి నిపుణులైన డాక్టర్లతో కూడిన త్రిసభ్య కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించింది. ఇందులో భాగంగా గాంధీ దవాఖానను పరిశీలించాల్సి ఉన్నది.

మిగతా 2లో.

## 'మిస్ యూనివర్స్ ఇండియా 2024'గా రియా సింఘా



2లో.

## సమష్టి శక్తిలో మానవాళి విజయం

**న్యూయార్క్‌లోని ఐరాస జనరల్ అసెంబ్లీలో మోదీ**



**సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:** మానవాళి విజయం యుద్ధభూమిలో లేదు.. సమష్టి శక్తిలో ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ శాంతి, అభివృద్ధికిగాను అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అవసరమన్నారు. న్యూయార్క్‌లోని ఐరాస జనరల్ అసెంబ్లీలో 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్' ను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ప్రపంచ భవిష్యత్తు గురించి అంతర్జాతీయ సమాజం చర్చిస్తున్న వేళ.. మానవ కేంద్రీకృత విధానాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో తన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మొత్తం ప్రపంచంతో పంచుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు.

సుస్థిరాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే మానవ సంక్షేమం, ఆహారం, ఆరోగ్య భద్రత కల్పించాల్సిన అవసరాన్ని ప్రధాని మోదీ గుర్తుచేశారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చినట్లు తెలిపిన ఆయన.. తద్వారా సుస్థిరాభివృద్ధి విజయం సాధించవచ్చని నిరూపించామన్నారు. ఈ విజయ అనుభవాలను గ్లోబల్ సౌత్‌తో పంచుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు.




## చైల్డ్ పోర్నోగ్రఫీ ఏ రూపంలో ఉన్నా నేరమే

స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
పోక్సో చట్టం వర్తిస్తుందని స్పష్టత

**హైదరాబాద్ సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:** చైల్డ్ పోర్నోగ్రఫీ ఏ పరిస్థితుల్లో, ఏ రూపంలో వున్నా సరే నేరమేనని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆ వీడియోలు చూసినా, డౌన్ లోడ్ చేసుకున్నా, షేర్ చేసినా.. పోక్సో చట్టం వర్తిస్తుందని స్పష్టత నిచ్చింది. న్యాయస్థానాలు చైల్డ్ పోర్నోగ్రఫీ అనే పదమే వాడకూడదని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. ఈమేరకు మద్రాసు హైకోర్టు తీర్పును సోమవారం జరిగిన విచారణలో సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

మిగతా 2లో.

# గాంధీ ఆస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత

**(మొదటి పేజీ తరువాయి)**

అయితే కమిటీ పర్యటనను కాంగ్రెస్ సర్కార్ అడ్డుకున్నది. రాజయ్య సహా కమిటీ సభ్యులైన మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే సంజయ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఖఅనేక నిర్బంధాల నడుమ గాంధీ దవాఖానకు చేరుకున్న కమిటీ సభ్యులతోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నుంచి బయటకు రాకుండా భారీగా పోలీసులు మోహరించారు. ఇదిలావుంటే గాంధీ ఆస్పత్రి వద్ద బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడాన్ని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. ప్రభుత్వాస్పత్రుల్లో ఉన్న పరిస్థితులను తెలుసుకునేందుకు వెళ్లిన త్రిసభ్య కమిటీ సభ్యులను అరెస్ట్ చేయటమా.. అసలు ప్రభుత్వానికి ఎందుకంత భయం.. కమిటీ తన పని తాను చేసుకొని పోతే నిజం బయటపడుతుందనా.. అసమర్థ చేతగాని ప్రభుత్వం అసలు రంగు బయట పడుతుందనా అంటూ ట్వీట్ చేశారు..నిజంగా ప్రభుత్వం ఏమీ దాచటం లేదంటే బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీని దర్యాప్తు చేయనివ్వండి. కమిటీ నివేదిక ద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి తెలుస్తాయి. ప్రజారోగ్యాన్ని మరింత మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వానికి సూచనలు అందుతాయి. కానీ ముఖ్యమంత్రి మాత్రం అవేవి జరగవద్దన్న ఇగోతో వ్యవహరిస్తున్నాడు. తెలంగాణ ప్రజల జీవితాలతో సీఎం చెలగాటం ఆడుతున్నాడు. ఇలాంటి పిచ్చి పనులను సీఎం మానేయాలని విజ్ఞప్తి చేస్తున్నా అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

కాగా.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు బీఆర్ఎస్ త్రీ మెన్ కమిటీని నియమించింది. ఈరోజు ఉదయం 10 గంటలకు గాంధీ ఆస్పత్రికి బీఆర్ఎస్ నేతలు తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే సంజయ్, మెతుకు ఆనంద్ వెళ్లాల్సింది. అయితే ముందుగానే అప్రమత్తమైన పోలీసులు కమిటీ మెంబర్స్‌ను హౌజ్ అరెస్ట్ చేశారు. తమను పోలీసులు అడ్డుకుంటున్నారని, హౌజ్ అరెస్టులు చేస్తున్నారని బీఆర్ఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు ఆరోపించారు. . వికారాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. త్రిసభ్య కమిటీలో ఆనంద్ సభ్యుడిగా ఉన్నారు. గాంధీ ఆసుపత్రికి వెళ్లనీయకుండా ఆనంద్‌ను పోలీసులు ఇంట్లోనే ఉంచారు. విషయం తెలిసిన కార్యకర్తలు భారీగా ఆనంద్ ఇంటి వద్దకు చేరుకుంటున్నారు. ఇంట్లోకి పోలీసులు వెళ్లకుండా కార్యకర్తలు అడ్డంగా కూర్చున్నారు. మరోవైపు ఆనంద్ ఇంటి చుట్టూ పోలీసులు పహారాకాసారు.

# యూట్యూబ్ న్యూస్ ఛానల్స్ పై
# రౌండ్ టేబుల్ సమావేశం !

**అనుసరించాల్సిన విధివిధానాలపై, తెలంగాణ మీడియా అకాడమీ సమావేశం..**

**వ్యక్తిగత ఎజెండాలతో, ద్వేషాలతో, కక్ష్యపూరిత ధోరణులతో, సమాజాన్ని తప్పు ద్రోవ పట్టించే వైఖరితో ప్రసారాలు..**

**తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి..**




**హైదరాబాద్ సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:**

యూట్యూబ్ న్యూస్ చానల్స్ గుర్తింపు అక్రిడిటేషన్ల జారీ, తదితరాలకు,నియమ నిబంధనలు, అనుసరించాల్సిన విధివిధానాలపై, తెలంగాణ మీడియా అకాడమీ సోమవారం హోటల్ టూరిజం ప్లాజాలో చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రముఖ సంపాదకులు, సీనియర్ జర్నలిస్టులు, యూట్యూబ్ చానెల్స్ నిర్వాహకులు పలు సూచనలు చేశారు.రౌండ్ టేబుల్ సమావేశంలో దాదాపు 50 మంది సీనియర్ జర్నలిస్టులు, సంపాదకులు, యూట్యూబ్ ఛానల్ ప్రతినిధులు వాటి వ్యవస్థాపకులు హాజరయ్యారు. పత్రికలకు ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్,టీవీ చానల్స్ కు మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ %డ% బ్రాడ్కాస్టింగ్ గుర్తింపు, కంపెనీ ఆక్ట్ కింద నమోదు కావటం యూట్యూబ్ న్యూస్ చానెల్స్ కి కూడా అవసరమని అభిప్రాయపడ్డారు. న్యూస్ వెబ్సైట్లకి కూడా అలాంటి నియమనిబంధనలే ఉన్నాయన్నది గుర్తు చేశారు.యూట్యూబ్ ఛానల్స్ గుర్తింపుకు అనుసరించాల్సిన అంశాలపై ఈ కార్యక్రమంలో సుదీర్ఘ చర్చ జరిగింది.ఈ విషయాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశాలు అయినందున వాటిని అమలుపర్చాల్సిన కర్తవ్యం యూట్యూబ్ చానెల్స్ పై ఉందని సమావేశం అభిప్రాయబడింది. అకాడమీ ఇలాంటి సమావేశం ఏర్పాటు చేయడం పట్ల సమావేశంలో పాల్గొన్న వాళ్ళందరూ హర్షం వెలిబుచ్చారు.ఇంకా దీనిపై నిర్దిష్ట చర్యలు జరపడానికి మరిన్ని చర్చలు జరపాలని, రౌండ్ టేబుల్ లో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణలో ఇది మొదటిదని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ అంశం పై ఇంకా లోతైన చర్చ జరగాల్సి ఉందన్నారు.

భావస్వేచ్ఛకు ఉన్న పరిమితులకు లోబడి, జర్నలిజం వృత్తికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు వార్తలు,చర్చా గోష్టిలు, ఇంటర్వ్యూలు,ప్రత్యేక కథనాలు ప్రసారం చేస్తున్న యూట్యూబ్ సంస్థలను మాత్రమే మీడియా సంస్థలుగా గుర్తించవచ్చనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది.సబ్ స్కయిబర్స్,వ్యూస్ ని ప్రధాన క్రైటేరియగా తీసుకోరాదని, ఎందుకంటే అంగట్లో సరుకుల్లాగా వాటి విక్రయం జరుగుతుందని పలువురు అభిప్రాయ పడ్డారు. వ్యక్తిగత ఎజెండాలతో, ద్వేషాలతో, కక్ష్యపూరితధోరణులతో, సమాజాన్ని తప్పు ద్రోవ పట్టించే వైఖరితో ప్రసారాలు చేస్తున్న వారిని పరిగణలోకి తీసుకోకపోవడం మంచిదనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది.ఎలాంటి చట్టబద్దత లేకుండా యూట్యూబ్ ప్లాట్ ఫామ్ లు సృష్టించి,హద్దు అదుపు లేకుండా చెలామణి అవుతున్న వారికి గుర్తింపు ఇవ్వడం ద్వారా మీడియా వ్యవస్థకు మచ్చ కలుగుతుందని, ఇందుకుగాను సంస్థ రిజిస్ట్రేషన్,లేబర్ లైసెన్స్,పోస్టల్ లైసెన్స్, ట్రేడ్ మార్క్ లైసెన్స్, జిఎస్టీ రిజిస్ట్రేషన్, కార్యాలయ నిర్వహణ తీరు,సిబ్బంది తదితర అంశాలను పరిశీలించాలనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. యూట్యూబర్స్ చేస్తున్న ప్రసారాలు జర్నలిజం నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది.సియాసత్ మేనేజింగ్ ఎడిటర్,ఎమ్మెల్సీ ఆమెరలి ఖాన్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే. శ్రీనివాస్,ముఖ్యమంత్రి సి పి ఆర్ ఓ,అయోధ్య రెడ్డి, మీడియా అకాడమీ పూర్వాధ్యక్షులు అల్లం నారాయణ,ప్రముఖ జర్నలిస్టులు దిలీప్ రెడ్డి,కట్టా శేఖర్ రెడ్డి, పద్మజా షా,ఎం.ఏ. మాజీద్,కరుణాకర్ దేశాయ్,జర్నలిస్ట్ నాయకులు విరహత్ అలీ,సోమయ్య,పలు యూట్యూబ్ ఛానల్ల ప్రతినిధులు, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్,మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతోనే దాడులు

**మెదక్ సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:**

నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై జరిగిన దాడి కాంగ్రెస్ నాయకత్వ ప్రోత్సాహంతోనే జరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై దాడి జరిగినట్టు తెలుసుకున్న హరీశ్‌రావు శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చేరుకొని సునీతను పరామర్శించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.



అనంతరం ఆమెతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గుండాల రాజ్యం నడుస్తున్నదని ఆరోపించారు. సిద్దిపేటలో తన క్యాంపు కార్యాలయంపై, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై, ఇప్పుడు గోమారంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపైన కాంగ్రెస్ నాయకులు దాడులకు తెగబడ్డారని మండిపడ్డారు. తెలంగాణకు ఉన్న మంచి పేరును నాశనం చేసి బీహార్, రాయలసీమ తరహాలో మారుస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి మాటలు, ఆయన రెచ్చగొట్టే విధానంతోనే ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇంట్లో పటాకులు పేల్చి, పిల్లలపై దాడి చేయడం అమానుషమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్పీ, ఐజీతో మాట్లాడి కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్టు చేయాలని కోరినట్టు తెలిపారు. ఫొటోలు, వీడియోలు తీస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌పై దాడిచేయడం ఏమిటని ప్రశ్నించారు. హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి జరిగినప్పుడు సుమోటోగా తీసుకొని ఆయన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చుకదా.. ఎందుకు చేయడం లేదని పోలీస్ ఉన్నతాధికారులను ప్రశ్నించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఎమ్మెల్యేపై కూడా ఇలాంటి దాడి జరగలేదని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలతో తమది పేగుబంధమని, ఎక్కడా ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా తాము చాలా జాగ్రత్తగా వ్యవహరించినట్టు తెలిపారు.

ప్రభుత్వం, పోలీసులు కూడా అలానే వ్యవహరిస్తే మంచిదని హితవు పలికారు. ఇంట్లోకి చొరబడి దాడిచేసిన వారిని అరెస్టు చేసి రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా ఉందని నిరూపించుకోవాలని సూచించారు. ఘటనపై పిటిషన్ ఇచ్చినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని, తక్షణమే గోమారంలో కాంగ్రెస్ గుండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యే అని చూడకుండా అర్ధరాత్రి దాడులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దీనిని వదిలిపెట్టే సమస్యే లేదని, అవసరమైతే జాతీయ మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని, కోర్టుకు వెళ్లేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

## ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి

గోమారం ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపించి, దాడికి పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి తక్షణమే అరెస్టు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరం కలసి డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మఠం భిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి మోసాన్ని బయటపెట్టినందుకు కాంగ్రెస్ సీనియర్లు అభినందించారు: కేటీఆర్

**హైదరాబాద్ సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:**

అమృత్ టెండర్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసాన్ని బయటపెట్టినందుకు కొందరు సీనియర్ కాంగ్రెస్ నేతలు తనను అభినందించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.కాంగ్రెస్ సీనియర్ల నుంచి తనకు అభినందనలు వస్తే, తెలంగాణ బీజేపీ నేతలు ఈ విషయంలో మౌనంగా ఉండటం తనకు ఆశ్చర్యం కలిగిస్తోందని పేర్కొన్నారు. తమకు ఏమి తెలియనట్లు, వినబడనట్లు బీజేపీ నేతల వ్యవహారం ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి, బీజేపీ నేతల మధ్య అద్భుతమైన ప్రేమకథ నడుస్తోందని చురక అంటించారు.అమృత్ టెండర్లలో రాష్ట్ర ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని కేటీఆర్ గత కొన్ని రోజులుగా ఆరోపిస్తున్నారు. నిజాలు నిగ్గు తేల్చాలంటూ కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, టోచన్ సాహుకు మూడు రోజుల క్రితం లేఖ కూడా రాశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కల్లిబొల్లి మాటలు చెప్పి పెద్దమనుషులను కూడా మోసం చేసిందని కేటీఆర్ మరో ట్వీట్‌లో విమర్శించారు. ఆసరా పెన్షన్లతో అవ్వ- తాతలకు కేసీఆర్ ప్రభుత్వం భరోసా నింపిందని, నాడు బీఆర్ఎస్ రెండు వేల రూపాయల పెన్షన్ ఇచ్చి కోడళ్ళు తమ అత్తలను ప్రేమగా చూసుకునేలా చేసిందని పేర్కొన్నారు. కేసీఆర్... బొడ్లో సంచి బరువు పెంచి అమ్మమ్మ-నాయనమ్మల గౌరవం పెంచారని పేర్కొన్నారు.రూ.4 వేలు ఇస్తానని అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ముసలవ్వలను రోడ్డు మీదకు తీసుకువచ్చాడని విమర్శించారు. మొన్న గద్వాల్ లో అవ్వా-తాతలు రోడ్ల మీద ధర్నా చేయగా, ఈరోజు వృద్ధ దంపతులు మానకొండూర్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చారని పేర్కొన్నారు. ఇందుకు సిగ్గనిపించడం లేదా రేవంత్ రెడ్డీ? అని నిలదీశారు. తక్షణం జూటా హామీని ఆపివేసి, అవ్వలకు 4 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ద

# చైల్డ్ పోర్నోగ్రఫీ ఏ రూపంలో ఉన్నా నేరమే

**(మొదటి పేజీ తరువాయి)**చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలను డౌన్ లోడ్ చేసుకున్నాడనే ఆరోపణలపై 28 ఏళ్ల యువకుడిని తమిళనాడు పోలీసులు అరెస్టు చేశారు. పోక్సో చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో ప్రవేశ పెట్టారు. కింది కోర్టు శిక్ష ఖరారు చేయడంతో ఆ యువకుడు మద్రాసు హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ తర్వాత హైకోర్టు తీర్పు చెబుతూ.. వీడియోలు డౌన్ లోడ్ చేసుకున్నప్పటికీ ఆ యువకుడు వాటిని ఎవరికీ షేర్ చేయలేదని, ఎవరినీ వేధించలేదని పేర్కొంటూ సదరు యువకుడిపై క్రిమినల్ చర్యలు నిలిపివేయాలని మద్రాసు హైకోర్టు గత జనవరిలో తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలువురు పిటిషన్ దాఖలు చేశారు. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ పిటిషన్లను సోమవారం విచారించింది. మద్రాసు హైకోర్టు తీర్పును ఈ బెంచ్ తప్పుబట్టింది. చైల్డ్ పోర్నోగ్రఫీ ఏ రకంగా ఉన్నప్పటికీ అది పోక్సో చట్టం కింద నేరార్హమేనని తీర్పు చెప్పింది.

# ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి ఇంటిపై దాడి

**కాంగ్రెస్ తొత్తులుగా పోలీసులు**

**ఎపి తరహాలో వారికి శిక్షలు తప్పవు**


**హరీష్ రావు తీవ్ర హెచ్చరికలు**



**హైదరాబాద్ సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:**

కాంగ్రెస్ ప్రభుత్వానికి కొందరు పోలీస్ అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని.. ఏపీ తరహా పరిణామాలు ఎదుర్కోవటానికి పోలీసులు సిద్ధంగా ఉండాలంటూ మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరించారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడి ఘటనకు సంబంధించి మాజీ మంత్రి హరీష్‌రావు స్పందించారు. ఈ సందర్భంగా ఏపీ పోలీస్‌శాఖలో జరిగిన పరిణామాలను మాజీ మంత్రి గుర్తుచేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన హరీష్‌రావు.. పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. ఏపీలో ఏమైందో పోలీస్ అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. చట్టాలకు లోబడి మాత్రమే పోలీసులు పనిచేయాలని హితవుపలికారు. బీఆర్ఎస్ క్యాడర్‌పై అక్రమ కేసులు పెడితే సహించేది లేదన్నారు. కొందరు పోలీసు అధికారాలు తీరు మార్చుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (అట ఖీ।లజీనిబిర ఖీ।టటా) హయాంలో గుండాయిజం పెరిగిపోయిందన్నారు. అత్యాచారాలు నిత్యకృత్యంగా మారాయని తెలిపారు. తొమ్మిది నెలల కాలంలో 2 వేల అత్యాచారాలు జరిగాయన్నారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి ఇంటి మీదకు వెళ్ళి దాడి చేయటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిపై కేసులు పెట్టాలని డీజీపీని డిమాండ్ చేస్తున్నట్లు మాజీ మంత్రి పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులపై హరీష్ మాట్లాడుతూ.. ఇప్పటికైనా ఫిరాయింపులపై కాంగ్రెస్ బుకాయింపులు మానుకోవాలన్నారు. అబద్దం అతికేటట్టు ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు తెలుసుకోవాలని హితవుపలికారు. ఫిరాయింపులపై మంత్రి శ్రీధర్ బాబు తెలివితేటలు ప్రదర్శిస్తున్నారన్నారు. మర్యాదపూర్వకంగా అయితే సీఎంను పార్టీ మీటింగ్‌లో కలుస్తారా? అని ప్రశ్నించారు. అరికెపూడి గాంధీ సొంత నియోజకవర్గానికి సీఎం వస్తే.. ప్రకాష్ గౌడ్ ఎందుకొచ్చినట్లు అని అడిగారు. కాంగ్రెస్ నీతిని ప్రజలు గమనిస్తున్నారని. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ కు శిక్ష తప్పదని హరీష్‌రావు హెచ్చరించారు.?

# 'మిస్ యూనివర్స్ ఇండియా 2024'గా
# రియా సింఘా



**జైపూర్ :** జైపూర్ వేదికగా జరిగిన 'మిస్ యూనివర్స్ ఇండియా 2024' పోటీల్లో ఈ ఏడాది మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని రియా సింఘా సాధించుకున్నారు. గుజరాత్‌కు చెందిన రియా సింఘా 18 ఏళ్ల వయసు లోనే ఈ అందాల పోటీల్లో గెలిచి అందరినీ ఆకర్షించారు. 51 మంది ఫైనలిస్టులతో పోటీ పడుతూ ఆమె ఈ కిరీటాన్ని దక్కించుకున్నారు. 2015 లో మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని సొంతం చేసుకున్న ఊర్వశీ రౌతేలా ఈ ఈవెంట్‌కు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ ఏడాది మిస్ యూనివర్స్ ఇండియా పోటీల్లో విజేతగా రియా నిలవడం ఆనందంగా ఉందని ఊర్వశీ అభినందించారు. 'ఈ రోజు నేను టైటిల్ గెలుచుకోవడం జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను.ఈ పోటీలో పాల్గొనడం కోసం ఎంతో కష్టపడ్డాను. ఈ స్థాయికి చేరుకోవడం వెనుక చాలా కృషి ఉంది. గతంలో ఈ పోటీల్లో గెలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకున్నాను" అని రియా భావోద్వేగంతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఊర్వశీ మీడియాతో మాట్లాడుతూ %ూ% గ్లోబల్ మిస్ యూనివర్స్ 2024లో భారత్‌కు రియా ప్రాతినిధ్యం వహించనుంది. రియా ఆ పోటీల్లోనూ విజేతగా నిలవాలని నేను కోరుకుంటున్నాను. ఈ పోటీల్లో పాల్గొన్న అమ్మాయిలంతా ఎంతో కష్టపడ్డారు. వారి అంకిత భావం ఆశ్చర్యపరిచింది" అన్నారు.

# ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు

**(మొదటి పేజీ తరువాయి)**

దీర్ఘ కాలంలో వైద్యసేవలకు ఉపయోగపడేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులో ప్రతి కుటుంబ సభ్యుని హెల్త్ ప్రొఫైల్ ఉండాలని పేర్కొన్నారు. కుటుంబసభ్యుల వివరాల్లో మార్పులు, చేర్పుల కోసం ఈ కార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పర్యవేక్షణకు జిల్లాలవారీగా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, సీఎస్ శాంతికుమారి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, సంగీత సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
మంగళవారం 24 సెప్టెంబర్ 2024

# ఫరుక్ నగర్ తహసిల్దార్ కార్యాలయం ముందు ఇష్టారాజ్యం

- రోడ్డుకు ఇరువైపులా డబ్బాలు ఇబ్బందులకు గురవుతున్న విద్యార్థులు కాలనీవాసులు..
- రిజిష్ట్రేషన్ కు వచ్చే వాహనాలతో మరీ ఇబ్బందిగా మారిన రహదారి..
- రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్న వాహనదారులు..
- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం..
- అనుమతులు లేకుండా వెలసిన చర్యలు తీసుకోవడంలో అధికారుల వెనుకడుగు..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, సామాన్య ప్రజలు..





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**

అంతా మా ఇష్టం. ఎవరి అనుమతులు మాకు అవసరం లేదు ఎవరితో పర్మిషన్ తీసుకోవాల్సిన అవసరం కూడా లేదు మాకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉంటే చాలు ఏ అధికారి కూడా మా వైపు కన్నెత్తి చూడడు.అది మా పవర్.డబ్బాలను నిర్మిస్తాం, అవసరమనుకుంటే శాశ్వత కట్టడాలను ఏర్పాటు చేస్తాం ఇది ఫరుక్ నగర్ తహసిల్దార్ కార్యాలయం ముందు ఇష్టానుసారంగా వెలుస్తున్న అక్రమ డబ్బా యజమానుల తీరు.షాద్ నగర్ మున్సిపాలిటీ ఫారుక్ నగర్ తాసిల్దార్ కార్యాలయం ముందు ఉన్న ప్రధాన రహదారిపై ఇష్టానుసారంగా డబ్బాలు వెలుస్తున్న మున్సిపల్ శాఖ అధికారులు కానీ, రెవిన్యూ శాఖ అధికారులు కానీ కనీస చర్యలు తీసుకోవడం లేదు. అసలే నిత్యం వందల సంఖ్యలో ఈ రహదారి గుండానే విద్యార్థులు, సామాన్య ప్రజలు, తాసిల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా ఆఫీసర్స్ కాలనీ,రాఘవేంద్ర కాలనీ,నోబెల్ పార్క్, శ్రీనగర్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, క్రిస్టియన్ కాలనీ ల ప్రజలతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల,ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, టాగూర్ హై స్కూల్, వివేకానంద బాలికల పాఠశాల,ప్రతిభ బాలికల జూనియర్ కళాశాల,ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల,ప్రభుత్వ బాలికల వసతిగృహం ల విద్యార్థులు ఈ దారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు.పైగా తాసిల్దార్ కార్యాలయంలో ధరణి సేవలు ప్రారంభమైనప్పటి నుంచి నిత్యం వాహనాల రద్దీ మరింత పెరిగింది. అయినప్పటికీ రోడ్డును ఆక్రమిస్తూ తమకు తోచిన విధంగా నిర్మాణాలను చేపడుతున్నారు. ఫలితంగా రోడ్డు విస్తరణ తగ్గడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా తాజాగా ఓ నిర్మాణం వెలిస్తే గతంలో ఆరు నిర్మాణాలు వెలిశాయి. రోడ్డుపై ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్న అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు.ఇదిలా ఉంటే రెవెన్యూ కార్యాలయానికి వచ్చే వాహనాల రద్దీ మరీ ఎక్కువైంది ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కు చేసి వెళ్లడంతో అటు కాలనీలకు వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు . ఒక్కొక్కసారి ట్రాఫిక్ జామ్ తో ప్రజలు ఇబ్బందుల ఫాలవుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్న కనీసం పట్టించుకున్న పాపాన పోవట్లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే గత మూడు రోజుల క్రితం అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని మున్సిపల్ శాఖ అధికారులు చెప్పిన ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.ప్రజల అవసరాల దృష్ట్యా మెరుగైన మౌలిక వసతులను కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనే విషయాన్ని పాలకులు, అధికారులు గ్రహించాలని ప్రజలు సూచిస్తున్నారు.

## పర్యావరణ రహిత విస్తరాకుల తయారీ కేంద్రాన్ని

### ప్రారంభించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..







ప్రజావినికిడి, (రాజేంద్రనగర్): సెప్టెంబర్ 23, రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి మున్సిపాలిటీ ఖానాపూర్ లో ఇందిరా మహిళా శక్తి వారి ఆధ్వర్యంలో,మెప్మా వారి సౌజన్యంతో నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ లో పర్యావరణ రహిత విస్తరాకుల తయారీ కేంద్రాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలోనే మొట్టమొదటి మహిళా సంఘ సభ్యులచే ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా శ్రీ లక్ష్మీ స్వయంకృషి పర్యావరణ విస్తరాకుల తయారీ కేంద్రం ప్రారంభించడం అభినందనీయమన్నారు. పర్యావరణానికి మేలు చేసే ఆకులతో విస్తరాకులం తయారు చేయడం చాలా సంతోషం అన్నారు. వీరి స్ఫూర్తితో మహిళా సంఘ సభ్యులు ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ఉపయోగించుకొని స్వయం సమృద్ధి సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్మన్ నాగపూర్ణ శ్రీనివాస్,కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు మెప్మా అధికారులు పాల్గొన్నారు.

## మత్స్య కార్మిక సంఘం సొసైటీ ఆధ్వర్యంలో

### గోడ పత్రికను విడుదల చేసిన జిల్లా ఉపాధ్యక్షులు నీరటి మల్లేష్




ప్రజావినికిడి, (శంషాబాద్):సెప్టెంబర్ 23, మత్స్య కార్మిక సంఘం సొసైటీ ఆధ్వర్యంలో గోడపత్రికను విడుదల చేయడం జరిగింది. ఈనెల 25వ తేదీన ఇబ్రహీంపట్నంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్తంగా జరిగే సదస్సును విజయవంతం చేయాలని వాల్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగిందని మత్స్య కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నీరటి మల్లేష్ అన్నారు.ఈ సందర్భంగా మత్స్య కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నీరటి మల్లేష్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి మత్స్యకారులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.చెరువులు కుంటలు కబ్జాలకు గురికాకుండా చూడాలని అన్నారు. చెరువుల కుంటలకు కాలుష్యం వదులుతున్న సందర్భంగా వాటిని కాలుష్యం నుండి కాపాడాలని అన్నారు. ప్రభుత్వం చెరువులో చేప పిల్లలను ఇవ్వకుండా ప్రతి సొసైటీకి 10 లక్షల రూపాయలు ఇచ్చి నాణ్యత మైన చేప పిల్లలను ఆ సొసైటీలే పిల్లలను తెచ్చుకుంటారు అని అన్నారు.మచ్చ వృత్తి రక్షణ ఉపాధి జీవిత భద్రత కల్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మాజీ ప్రెసిడెంట్ కృష్ణ ముదిరాజ్,సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు నీరటి వెంకటేష్ ముదిరాజ్,డైరెక్టర్ కనకమామిడి సిద్ధులు ముదిరాజ్,నీరటి పెంటయ్య ముదిరాజ్, నీరటి హరీష్ ముదిరాజ్,పోగుల రాములు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య కార్పొరేషన్ చైర్మన్ ను ప్రకటించాలి..



ప్రజావినికిడి,(ఎల్బీనగర్) సెప్టెంబర్22,
ఏకలవ్య కార్పొరేషన్ చైర్మన్ ను వెంటనే ప్రకటించాలని మంత్రి సీతక్కకు వినతి పత్రం అందచేసిన కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు బుడ్డ సత్యనారాయణ.ఈ సంధర్భంగా మంత్రి సీతక్కకు కాంగ్రెస్ పార్టీ లో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఏకలవ్య కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు.
ఈ మధ్య కాలంలో ఇతర పార్టీలకు చెందిన కొంత మంది కార్పొరేషన్ చైర్మన్ పదవి కొరకు వలసలు గా వస్తున్నారని మంత్రి సితక్కకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏరకుల కృష్ణ ,కెంసారం ఎల్లయ్య,చెర్ల రమేష్,ఉల్లంగొండ్ల రాజు,మల్లికార్జున్,మున్న జాని పాల్గొన్నారు.

## మాజీమంత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే శ్రీ టీ.ప్రకాష్ గౌడ్



ప్రజావినికిడి, (రాజేంద్రనగర్): సెప్టెంబర్ 23, మాజీమంత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ.ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. సోమవారం మాజీ మంత్రి నివాసంలో మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డికి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ.ప్రకాష్ గౌడ్ శాలువా కప్పి పూల గుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## గూడూరు లో అంగరంగ వైభవంగా గణనాథుని నిమజ్జనం..

### గ్రామ ప్రజల్ని ఆ భగవంతుడు చల్లగా చూడాలి..

### గణపతికి ప్రత్యేక పూజలు చేసిన: గుండు ఆంజనేయులు ముదిరాజ్..



**ప్రజావినికిడి, (కొత్తూరు):సెప్టెంబర్ 23,** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల గూడూరు గ్రామంలో ఘనంగా గణనాదుని నిమర్జనం జరిపారు.గూడూరు గ్రామములో ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గుండు ఆంజనేయులు ముదిరాజ్ తెలియజేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గూడూరు గ్రామంలో 16 రోజులు నవరాత్రుల ప్రత్యేకంగా పూజలు చేస్తామని తెలిపారు.చిన్ననాటి నుంచి వినాయకుని నిలబెట్టడం మాకు ఇష్టమని,20 సంవత్సరాల క్రితం మట్టి వినాయకుడికి కుసుమలతో పెట్టి అంగరంగ వైభవంగా గణనాథుడికి పూజలు చేసి పించేవాడినని గ్రామస్తులు కూడా అన్ని విధాలుగా ప్రోత్సహించేవారు అన్నారు.అంగరంగ వైభవంగా నిమజ్జనం ఏర్పాటు చేశామని, భక్తి పాటలతో నృత్యాలతో గణనాధుని నిమర్జనానికి తీసుకెళ్తాం అన్నారు, గణనాథుని నిమజ్జనం సమయంలో ప్రతి సంవత్సరం వర్షం పడుతోంది ఈ సంవత్సరం కూడ మా గ్రామంలో వర్షం నమోదు అయ్యిందని అన్నారు.గ్రామస్తులు ఎంతో ఇష్టపూర్వకంగా ఈ గణపతి నిమార్జనంలో పాల్గొంటారని, తీర్థప్రసాదాలు తీసుకుంటారని, గణపతికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఉన్న రైతులు చిన్నల్లు పెద్దలు ప్రతి ఒక్కరిని భగవంతుడు చల్లగా చూడాలని గుండు ఆంజనేయులు అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల ఆలయంలో శాంతిహోమం

**పంచగవ్యాలతో శ్రీవారి ఆలయంలో ప్రోక్షణ**

**ఒకరోజు హోమంతో అంతటా సంప్రోక్షణ కార్యక్రమం**

**స్వచ్ఛమైన నేతితోనే లడ్డూలు.. ఇతర ప్రసాదాల తయారీ**

**తితిదే ఈవో శ్యామలరావు, ప్రధానార్చకుల వివరణ**

**తిరుమలసెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:**

శ్రీవారి ఆలయంలో జరిగిన దోషాలకు ప్రాయశ్చిత్తంగా శాంతి హోమం నిర్వహించారు. ఆలయంలోని అన్ని విభాగాల్లో ప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకంతో అపచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం శ్రీవారి ఆలయంలో మహా శాంతియాగం చేపట్టారు. పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా హోమం పూర్తి అయ్యింది. సోమవారం రోహిణి నక్షత్రం శ్రీవారికి ముహూర్త బలం కావడంతో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మహాశాంతి యాగాన్ని నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో ఆగమ పండితులు, అర్చకులు హోమం నిర్వహించారు. ముందుగా మహాశాంతి యాగం, వాస్తు హోమం నిర్వహణ జరిగింది.కాగా శ్రీవారికి నిర్వహించే ఆర్జితసేవలకు ఆటంకం కలగకుండా ఒక్కరోజు మాత్రమే యాగం నిర్వహించేలా ఆగమ పండితులు నిర్ణయించారు. ప్రస్తుతం మహాశాంతియాగం ముగియగా.. పంచగవ్యాలతో శ్రీవారి ఆలయంతో పాటు వకుళ మాత పోటు, లడ్డు పోటు, బూందీ పోటు, ప్రసాద విక్రయశాలల్లో అర్చకులు సంప్రోక్షణ చేపట్టారు. ఆలయంలో శాంతి హోమం, పంచగవ్య ప్రోక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాల అనంతరం తితిదే ఈవో శ్యామలరావు, ఆలయ అర్చకులు మీడియాతో మాట్లాడారు. ఆలయంలోని అన్ని విభాగాల్లో ప్రోక్షణ కార్యక్రమాలు చేసినట్లు ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. స్వామి వారికి మహానైవేద్యం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రసాదాల తయారీ కేంద్రాల్లో ప్రోక్షణ చేస్తున్నామని అన్నారు. దోషం కలిగిందన్న భావన లేకుండా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. చివరిగా పూర్ణాహుతి కార్యక్రమంతో అన్ని దోషాలు తొలగుతాయని తెలిపారు. భక్తులెవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఇటీవల జరిగిన దోషాలు తొలగిపోవాలని శాంతి హోమం చేశాం. పవిత్రోత్సవాలకు ముందే నెయ్యి మార్చేశాం. లడ్డూ ప్రసాదం విషయంలో ఇకపై ఎలాంటి అనుమానాలొద్దు. పవిత్రోత్సవాల ముందు జరిగిన దోషం.. పవిత్రోత్సవాలతో పోయింది. మార్చిన నెయ్యితోనే ఆ తర్వాత ప్రసాదాలు తయారుచేశాం. తెలిసీ తెలియక జరిగిన దోషాలు శాంతిహోమం, ప్రోక్షణతో తొలగుతాయని వేణుగోపాల దీక్షితులు అన్నారు. తిరుమలలో కలకలం రేపిన కల్తీ నెయ్యి దోషాన్ని గత నెల ఆగస్టులో సంప్రోక్షణతో పోగొట్టామని, భక్తులు ఎవరూ ఆందోళన చెందవద్దని టీటీడీ కార్యనిర్వహణాధికారి శ్యామలరావు




వెల్లడించారు. తిరుమల ఆలయంలో నిర్వహించే అనేక కార్యక్రమాల్లో తెలుసో తెలియక జరిగే దోష నివారణకు ప్రతి ఏడాది శ్రావణ మాసంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తాం. ఇందులో భాగంగా ఆగస్టులోనే ఆలయంలో అన్న ప్రసాదపోటు, లడ్డూ పోటులో సంప్రోక్షణ చేశాం. అందులోని కృష్ణస్వామి మూర్తులకు పవిత్రాలను సమర్పించాం. కల్తీ నెయ్యి వలన ఏమైనా దోషాలు ఉండుంటే కూడా తొలగిపోయాయి. అయినప్పటికీ భక్తుల్లో నెలకొన్న ఆందోళన దృష్ట్యా ఆగమశాస్త్ర పండితులు, పెద్దజియ్యంగార్లను సంప్రదించిన తర్వాత సీఎం చంద్రబాబు శ్రీవారి ఆలయంలో ఒకరోజు శాంతి హోమం నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శాంతిహోమం చేపట్టామని అన్నారు. శ్రీవారి ఆలయంలోని యాగబావి వద్ద యాగశాలలో, మూడు హోమగుండాలు (వాస్తు, సభ్యం, పౌండరీక) ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా నిర్వహించామని అన్నారు. అదేవిధంగా అన్ని ఆలయాల్లో పంచగవ్య ప్రోక్షణ చేపట్టామని ఈవో శ్యామలరావు వివరించారు.



సీతారామాంజనేయులు కాంతిరాణా తాతా విశాల్ గున్ని

# జెత్వానీ కేసు.. రిమాండ్ రిపోర్టులో ఐపీఎస్ ల పేర్లు

**ముగ్గురు ఐపీఎస్ లను నిందితులుగా చేర్చిన పోలీసులు**

**కుక్కల విద్యాసాగర్ ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచిన పోలీసులు**

**ఏ2, ఏ3, ఏ6లుగా పీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా, విశాల్ గున్నీ**

**అమరావతి సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:**

ముంబై హీరోయిన్ జెత్వానీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులను పోలీసులు నిందితులుగా చేర్చారు. ఈ కేసులో కీలక నిందితుడు కుక్కల విద్యాసాగర్ ను ఈ తెల్లవారుజామున పోలీసులు మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా పోలీసులు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో సీనియర్ ఐపీఎస్ అధికారులు పీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా తాతా, విశాల్ గున్నీలను నిందితులుగా చేర్చారు. ఈ కేసులో ఏ1గా విద్యాసాగర్, ఏ2గా పీఎస్సార్ ఆంజనేయులు, ఏ3గా కాంతి రాణా, ఏ4గా వెస్ట్ జోన్ మాజీ ఏసీపీ హనుమంతరావు, ఏ5గా ఇబ్రహీంపట్నం మాజీ సీఐ సత్యనారాయణ, ఏ6గా విశాల్ గున్నీ పేర్లను పేర్కొన్నారు. మరోవైపు, కుక్కల విద్యాసాగర్ కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. విద్యాసాగర్ ను విచారిస్తే పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ కేసులో పలు నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఉన్న నేపథ్యంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కాంతి రాణా తాతా ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. రేపటి వరకు కాంతి రాణాపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. ఆయన ముందస్తు బెయిల్ పై హైకోర్టు రేపు తీర్పును వెలువరించనుంది

## కొన్ని వ్యాధులకు వాడే యాంటీబయోటిక్స్ రెసిస్టెన్స్ తగ్గిపోయింది : ఐసిఎంఆర్

**హైదరాబాద్ సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:**




ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (సి) ఇటీవలి నివేదిక ప్రకారం యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్‌లు (యుటిఐలు), బ్లడ్ ఇన్‌ఫెక్షన్లు, న్యుమోనియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు సాధారణంగా ఉపయోగించే యాంటీబయాటిక్స్ అంతగా పనిచేయడం లేదని తెలుస్తోంది. యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ యొక్క 2023 వార్షిక నివేదిక నుండి ఈ ఫలితాలు వచ్చాయి, ఇది ఏడాది పొడవునా సేకరించిన డేటాపై ఆధారపడి ఉంది. ఈ నివేదిక భారతదేశం అంతటా యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ లో ఇబ్బందికరమైన అంశాలను హైలైట్ చేసింది. సెఫోటాక్సిమ్, సెఫ్టాజిడిమ్, సిప్రోఫ్లోక్సాసిన్ , లెవోఫ్లోక్సాసిన్ వంటి యాంటీబయాటిక్స్ గ్రహణశీలత రేటు 20% కంటే తక్కువగా నిర్ధారణ అయింది. యాంటీబయోటిక్స్ మునుపటిలా ప్రభావవంతంగా పనిచేయడం లేదని, వాటి ప్రభావశక్తి తగ్గిందని నివేదిక తెలిపింది.

## గ్రామాల్లో మంచినీటి సహాయకులు

**అధికారులతో సమీక్షలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**హైదరాబాద్ సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:**



గ్రామాల్లో తాగునీటి సరఫరా విషయంలో నూతన ఒరవడికి ప్రభుత్వం నాంది పలికిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు.

ప్రతి గ్రామంలో మంచినీటి సహాయకుడిని నియమించి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 15 జిల్లాల్లోని 60 ప్రాంతాల్లో శిక్షణ కొనసాగుతోందని.. ఈ నెలాఖరులోగా అన్ని గ్రామాలకూ సహాయకులను నియమించి శిక్షణ పూర్తి చేస్తామన్నారు.తాగునీటి నాణ్యత పరిశీలనతోపాటు బోర్లు పాడైతే అదే రోజు మరమ్మతులు జరిగేలా, లీకేజీలను సరిచేసేలా గ్రామాల్లో మంచినీటి సహాయకులు కృషి చేస్తారని వివరించారు. సోమవారం సచివాలయం నుంచి శాఖాపరమైన సమీక్ష సందర్భంగా వివిధ విభాగాలవారీగా పనుల్లో వేగం పెంచాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. కొనసాగుతున్న పనుల పురోగతిని ఆమె అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ హయాంలోని పెండింగ్ బిల్లులను త్వరలో చెల్లిస్తామని చెప్పారు. విభాగాలవారీగా నూతన పనులకు కార్యాచరణ సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, పీఆర్ ఆర్డీ కమిషనర్ అనితా రామచంద్రన్, స్పెషల్ కమిషనర్ షఫీఉల్లా హాజరయ్యారు.

# ఖరీఫ్ నుంచే కొత్త నిబంధనలు



**మిల్లర్ల అక్రమాలకు చెక్ పెట్టే దిశగా త్వరలో అధికారిక ఉత్తర్వులు**

**డిఫాల్ట్, పెండింగ్ కేసులు ఉన్న మిల్లులకు ధాన్యం బంద్**

**హైదరాబాద్ సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:**

మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు రూపొందించింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా దారి మళ్లించడం, నాణ్యమైన బియ్యం విక్రయించి రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి పౌరసరఫరాల శాఖను మోసం చేయడం వంటి చర్యలకు పాల్పడకుండా మిల్లర్లపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది.

ఈ మేరకు రూపొందించిన మార్గదర్శకాలకు ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోద ముద్ర వేసింది. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. సోమవారం మంత్రి ఉత్తమ్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన సమావేశంలో ఈ నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్టు తెలిసింది.

**కెపాసిటీకి అనుగుణంగా కేటాయింపులు**

రైస్‌మిల్లులు తమకు కేటాయించిన ధాన్యాన్ని ఏడాదిన్నర వరకు కూడా మిల్లింగ్ పూర్తి చేయకుండా తమ వద్దే నిల్వ ఉంచుకుంటున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. తద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరగడం, ఎఫ్‌సీఐ రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంలో ఆలస్యం చేయడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

ఈ నేపథ్యంలో మిల్లులు సీఎంఆర్ కోసం ప్రతిరోజు రెండు షిఫ్టుల్లో 16 గంటలు పనిచేయాలని మార్గదర్శకాల్లో పొందుపరిచారు. ముడి బియ్యం ఇచ్చే రా రైస్ మిల్లులకు వడ్లు కేటాయిస్తే 8 గంటల చొప్పున రెండు షిఫ్టుల్లో రోజుకు 16 గంటలు మిల్లింగ్ చేసి 75 రోజుల్లో కేటాయించిన ధాన్యంలో 67శాతం రా రైస్ ఇవ్వాల్సి ఉంటుంది. మిల్లుల కెపాసిటీకి అనుగు ణంగా ధాన్యం కేటాయించనున్నారు.

**డిఫాల్టర్లపై ఉక్కుపాదం**

గతంలో అక్రమాలకు పాల్పడినట్టు తేలిన మిల్లర్లకు, ఫేక్ ట్రక్ షీట్లు సృష్టించి కేసుల్లో ఇరుకున్న వారికి, 6 ఏ ఈసీ యాక్ట్, క్రిమినల్ కేసులు పెండింగ్ ఉన్న వారికి ఈ ఖరీఫ్ సీజన్ నుంచి ధాన్యం కేటాయించకూడదని, వీరికి ఈ సీజన్‌తోపాటు వచ్చే రెండు సీజన్‌ల వరకు వడ్లు ఇచ్చే ప్రసక్తే లేదంటున్నారు.డిఫాల్ట్ అయిన మిల్లర్లు బకాయి పడ్డ సీఎంఆర్‌ను అప్పగించి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తీసుకుంటేనే కొత్తగా ధాన్యం కేటాయించనున్నారు. మిల్లర్లు లీజు డీడ్ ఇవ్వడంతోపాటు కేటాయించిన ధాన్యానికి బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి కానుంది.

**కలెక్టర్ల పర్యవేక్షణ...**

జిల్లాల వారీగా రైస్‌మిల్లుల్లో సాగే సీఎంఆర్‌పై కలెక్టర్లకే బాధ్యతలు అప్పగించనున్నా రు. ధాన్యం కొనుగోళ్ల నుంచి మిల్లింగ్ వరకు వారే కీలకం. బాయిల్డ్ రైస్‌మిల్లర్లు ఫోర్టిఫైడ్ రైస్ ఇచ్చేందుకు డిసెంబర్ 31లోగా ఎఫ్ఆర్‌కే బ్లెండింగ్, సోర్టెక్స్ మెషీన్లు ఇన్‌స్టాల్ చేసుకు నేలా ఆయా జిల్లాల కలెక్టర్ చర్యలు తీసు కొని, వారికే ధాన్యం కేటాయించాల్సి ఉంటుంది.


జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి అర్హత ఉన్న మేరకే ధాన్యం కేటాయించాలి. మిల్లు లను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కేటాయించిన ధాన్యం దారిమళ్లినా, ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రైవేట్‌గా విక్రయించినా క్రిమినల్ చర్యలు తప్పనిసరి.

# ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మోదీ

**రాజ్యసభ సభ్యుడు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్**

**మహేశ్వరం సెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:**

ప్రపంచానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆదర్శంగా నిలిచారని, బిజెపితోనే సుస్థిర పాలన సాధ్యమని రాజ్యసభ సభ్యుడు, బిజెపి ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు.ఆదివారం ప్రధాని నరేంద జన్మదినం సందర్భంగా భారతీయ జనతా యువమోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు టి. యాదీశ్ ఆధ్వర్యంలో ఆదిత్య బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో ఉచిత వైద్యశిబిరం,రక్తదాన శిబిరం, ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహ బీజేవైఎం అధ్యక్షులు సేవెళ్ల మహేందర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తుళ్ల వీరేందర్ గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్ తో కలిసి ఆయన పాల్గొన్నారు.



ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ భారతదేశాన్ని ప్రపంచ దేశాలలో నెంబర్ వన్ దేశంగా తయారు చేయాలనే ఉద్దేశంతో అనేకమైన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. దేశం అభివృద్ధి గురించి ఆలోచిస్తుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో దేశంపై వ్యతిరేకంగా విష ప్రచారం చేస్తున్నారని, ఇది దేశ ప్రజలందరూ గమనిస్తున్నారని పేర్కొన్నారు.కాగా శిబిరంలో 113 మంది రక్త దానం చేయగ, 230 మంది హెల్త్ చెక్ అప్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. 300 మంది కంటి పరీక్షలు చేసుకున్నారని అన్నారు.

30 మందికి ఉచిత ఆపరేషన్ కు తీసుకెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బోసు పల్లి ప్రతాప్, పోరెడ్డి అర్జున్ ఈ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు కాసాని శ్రీను, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింగ్ రాజ్, మాధవ్ రెడ్డి, ఉటు మహేందర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బూర దిలీప్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు బోధ యాదగిరి రెడ్డి, చింతల రాఘవేందర్, గోవర్ధన్ రెడ్డి, బస్వ రఘు గౌడ్, రూపక్, విజేందర్ రెడ్డి, బొర్ర సాయిలు, ఓం ప్రకాష్, స్థానిక కౌన్సిలర్ రాజమోని రాజు, బాకీ విలాస్, జిల్లా నాయకులు ప్రశాంత్, అఖిల్ కుమార్, మాధవ్, హరికృష్ణ, ముత్యాల అనిల్, శశిధర్ రెడ్డి, మహేందర్, వరుణ్, దేవేందర్ నాయక్ పాల్గొన్నారు.

## భారత్‌లో క్లేడ్ 1 మంకీపాక్స్ తొలి కేసు నమోదు

**న్యూఢిల్లీసెప్టెంబర్ 23(ప్రజావినికిడి,:**




భారత్‌లో ప్రాణాంతక క్లేడ్ 1 బీ రకం మంకీపాక్స్ తొలికేసు నమోదైంది. ప్రపంచ ఆరోగ్య అత్యయిక స్థితికి దారి తీసిన క్లేడ్ 1 బీ రకంగా దీన్ని గుర్తించారు. కేరళ లోని మలప్పురానికి చెందిన 38 ఏళ్ల వ్యక్తిలో ఈ వ్యాధి నిర్ధారణ అయినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. యూఏఈ నుంచి ఇటీవలనే ఆయన కేరళకు వచ్చాడు. అతడిలో ఎంపాక్స్ లక్షణాలు కనిపించడంతో వైద్య పరీక్షలు చేయగా క్లేడ్1 గా నిర్ధారణ అయ్యింది. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపాక్స్‌ను ప్రజా ఆరోగ్య అత్యయిక స్థితిగా గత నెల రెండోసారి ప్రకటించడానికి దారి తీసింది. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఎంపాక్స్ మొదటి కేసు ఢిల్లీలో బయటపడింది.హర్యానా లోని హిసార్‌కు చెందిన 26 ఏళ్ల యువకునిలో ఎంపాక్స్ లక్షణాలు కనిపించాయి. అతనిలో పశ్చిమాఫ్రికాలో వ్యాప్తిలో ఉన్న క్లేడ్2 రకం లక్షణాలు గుర్తించారు. అయితే దీని తీవ్రత తక్కువగా ఉన్నట్టు వైద్యులు పేర్కొన్నారు. దాదాపు రెండు వారాల పాటు ఢిల్లీ లోని ఎల్ఎన్‌జేసీ ఆస్పత్రిలో చికిత్స పొందిన తరువాత సెప్టెంబర్ 21న డిశ్చార్జి అయ్యాడు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపాక్స్‌ను ప్రజా ఆరోగ్య అత్యయిక పరిస్థితిగా 2022లో ప్రకటించింది. అప్పటి నుంచి భారత్‌లో 30 కేసులు నమోదయ్యాయి. ఈ వ్యాధి పట్ల తీసుకోవాలసిన మార్గదర్శకాలను కేరళ ప్రభుత్వం వెల్లడించింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# న్యూ లుక్‌లో మహేశ్ బాబు

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మహేశ్

### రాజమౌళి సినిమాలో ఇదే లుక్ అంటూ ఊహాగానాలు



తమ అభిమాన హీరోలను చూసినప్పుడు అభిమానులు పొందే ఆనందమే వేరు. ఇక సదరు హీరో న్యూ లుక్‌లో కనపడితే వారి సంతోషానికి హద్దే వుండదు. ఇప్పుడు మహేష్ న్యూలుక్‌ను చూసి ఆయన ఫ్యాన్స్ అలాంటి అనుభూతికే లోనవుతున్నారు. మహేశ్, రాజమౌళి కలయికలో రూపొందనున్న చిత్రం త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. ఈ చిత్రంలో మహేశ్ ఎలా కనిపించబోతున్నాడనే విషయంపై అభిమానుల్లో కాస్త ఉత్కంఠ నెలకొంది. అయితే ఈ ఘట్టమనేని హీరో కూడా ప్రస్తుతం అదే మేకోవర్‌లో వున్నాడు. అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం ఇండియానా జోన్స్ నేపథ్యంలో వుంటుందని ఇటీవల రాజమౌళి తండ్రి, రచయిత విజయేంద్రప్రసాద్ ఓ ఇంటర్వ్యూలో చెప్పిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంలో మహేశ్ లుక్‌పై రకరకాల వార్తలు ప్రచారంలో వున్నాయి. అయితే మహేశ్ తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వరద బాధితుల కోసం రూ. 50 లక్షలు, ఏఎంబీ సినిమాస్ తరపున మరో రూ. 10 లక్షల విరాళం అందజేశారు. జూబ్లీహిల్స్ లోని రేవంత్ నివాసంలో ఆయనను కలిసి చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ తో పాటు ఆయన సతీమణి నమ్రత కూడా వున్నారు. మహేశ్, రేవంత్ రెడ్డిని కలిసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలో లాంగ్ హెయిర్, గడ్డం, వైట్ ఫుల్‌హ్యాండ్ టీషర్ట్‌లో కనిపిస్తున్న మహేశ్ బాబును చూసి ఆయన అభిమానులు పండగ చేసుకుంటున్నారు. తమ హీరో రాజమౌళి సినిమాలో ఇదే లుక్‌లో కనిపించబోతున్నాడని చర్చించుకుంటున్నారు.




# ఆస్కార్‌కు లాపతా లేడీస్

బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ మాజీ సతీమణి కిరణ్‌రావు దర్శకత్వంలో వచ్చిన 'లాపతా లేడీస్' అరుదైన ఘనత సాధించింది. 2025 ఆస్కార్‌కు మనదేశం నుంచి ఎంపికైంది. ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ విషయాన్ని అధికారికంగా తెలిపింది. స్పర్శ్ శ్రీవాత్సవ, నితాన్షి గోయెల్, ప్రతిభ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.మన దేశం తరపున ఈ సినిమా ఆస్కార్‌కు కచ్చితంగా ఎంపికవుతుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కిరణ్‌రావు ధీమా వ్యక్తంచేశారు. '2025లో ఆస్కార్ అవార్డుల్లో భారత్ తరఫున అధికారిక ప్రవేశానికి 'లాపతా లేడీస్' అర్హత సాధిస్తుందని నాకు పూర్తి నమ్మకముంది. ఈ సినిమా ఆస్కార్ వేదికపై మన దేశానికి ప్రాతినిధ్యం వహించాలనేది నాతో పాటు మా యూనిట్ అందరి కోరిక' అని కిరణ్‌రావు ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 2001 కాలపు చిత్రకథ ఇది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు నవ వధువులు రైలు ప్రయాణంలో అనుకోకుండా తారుమారైన సంఘటన ఇతివృత్తంగా 'లాపతా లేడీస్'ని తెరకెక్కించారు. ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్ నిర్మించారు. ప్రతిష్టాత్మక టోరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (టీఐఎఫ్ఎఫ్) వేడుకలో గతేడాది ఈ చిత్రాన్ని ప్రదర్శించడం విశేషం. సుప్రీంకోర్టు 75 ఏళ్ల వేడుకలో భాగంగా.. అడ్మినిస్ట్రేటివ్ భవనంలోని సి- బ్లాక్‌లో గల ఆడిటోరియంలో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. అలాగే 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ ' అవార్డుల్లోనూ లాపతా లేడీస్ క్రిటిక్స్ ఛాయిస్ విభాగంలో బెస్ట్ ఫిల్మ్‌గా నిలిచింది.

# క్యూట్ అవికా స్టన్నింగ్ లుక్స్



బాలికా వధు సీరియల్ దేశవ్యాప్తంగా బాగా పాపులారిటీ సొంతం చేసుకుంది. తెలుగు లో చిన్నారి పెళ్లి కూతురు గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ సీరియల్ తో అవికా చిన్న పాప గా పరిచయం అయింది. ఆ సీరియల్ తో వచ్చిన గుర్తింపు కారణంగా టాలీవుడ్ లో ఉయ్యాల జంపాల సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమాలోనే నటిగా మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. పైగా ఆ సినిమా కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకున్న కారణంగా వరుసగా ఆఫర్లు వచ్చాయి. హీరోయిన్ గా అవికా కి టాలీవుడ్ లో మంచి గుర్తింపు దక్కి పలు సినిమాల్లో నటించే అవకాశం దక్కింది. కొన్ని కారణాల వల్ల అవికా తక్కువ సమయంలోనే కనిపించకుండా పోయింది. అయితే కాస్త గ్యాప్ తర్వాత అవికా బౌన్స్ బ్యాక్ అయింది. బరువు పెరిగిన అవికా గ్యాప్ లో చాలా బరువు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచింది. రీ ఎంట్రీ లో కుమ్మేస్తాను అనుకున్న అవికా కి నిరాశ మిగిలింది. ఎక్కువ సినిమా ల్లో నటించే అవకాశాలు రాలేదు. తెలుగు లో ఆఫర్లు ఎక్కువ రాకపోవడంతో ఇతర భాషల్లోనూ ప్రయత్నాలు చేసింది. ఇటీవల ఈమె బ్రదర్ సినిమాలో నటించి మెప్పించింది. హీరోయిన్ గానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగా సైతం నటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇటీవల చెప్పుకొచ్చింది. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా తన అందమైన ఫోటోలను అవికా గోర్ షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. తాజాగా బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు షేర్ చేసి మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు ఎక్కువ మందికి నచ్చవు. కానీ అవికా బ్లాక్ అండ్ వైట్ లో కనిపించినా వావ్ అనిపించేంత అందంగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయి అందం కేవలం అవికా కే సాధ్యం అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో అవికా అందాల ఫోటోలు చూసి వావ్ స్టన్నింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇలాంటి ఫోటో షూట్స్ వల్ల ముందు ముందు మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు ఈ అమ్మడికి దక్కవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ ఈ ఫోటోలు చూసిన నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కెరీర్ ఆరంభంలో ఎంత అందంగా అయితే కనిపించిందో ఇప్పుడు అదే అందంతో, క్యూట్ గా స్టన్నింగ్ లుక్ లో అవికా కనిపిస్తోంది. వయసు పెరిగినా ఇంకా రెండు పదుల వయసుకు చేరువ అయిందా అనే అనుమానం కలిగేంత అందం ఈ అమ్మడి సొంతం అనడంలో సందేహం లేదు






హరిహరవీరమల్లుపై కీలక అప్‌డేట్
మార్చి 28న విడుదల కానున్నట్లు ప్రకటన

**హరిహర వీరమల్లు మార్చి 28న విడుదల**

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'హరి హర వీరమల్లు' క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తొలి భాగానికి సంబంధించి చిత్రీకరణ ముగింపుదశకు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే 'హరిహర వీరమల్లు' రిలీజ్ డేట్‌ను చిత్రబృందం తాజాగా ప్రకటించింది. వచ్చే ఏడాది మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా దీనిని విడుదల చేయనున్నట్లు తెలిపింది. 'అన్‌స్టాపబుల్ ఫోర్స్, అన్‌బ్రేకబుల్ స్పిరిట్ మార్చి 28న విడుదల కానుంది' అని పేర్కొంది. దీనిపై పవన్ అభిమానులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. పవన్ కల్యాణ్ రాజకీయాల్లో బిజీగా ఉండటంతో ఈ సినిమా చిత్రీకరణ వాయిదా పడుతూ వస్తోంది. తన సన్నివేశాలను పూర్తి చేసేందుకు తాజాగా ఆయన అంగీకరించారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం 7 గంటలకు విజయవాడలో సిద్ధం చేసిన భారీ సెట్‌లో షూట్ మొదలైంది. ఈ విషయాన్నీ చిత్రనిర్మాణ సంస్థ తెలియజేసింది. హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ నిక్ పాల్ ఆధ్వర్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఇక్కడ షూట్ చేయనున్నారని సమాచారం. పవన్‌తోపాటు కీలక నటీనటులు ఇందులో భాగం కానున్నారని తెలుస్తోంది.రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. అనుపమ్‌ఖేర్, బాబీ డియోల్, నిధి అగర్వాల్, నోరాహి ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్త కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి స్వరాలు అందిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఇది నిర్మితమవుతోంది.

# కన్నప్ప నుంచి మారెమ్మ పోస్టర్




మంచు ఫ్యామిలీ అభిమానులు ఎదురుచూస్తున్న సోమవారం రానే వచ్చింది. ఈ రోజు కన్నప్ప చిత్రం నుంచి మరో నూతన అప్డేట్ వచ్చింది. ఇప్పటికే గడిచిన రెండు నెలలుగా ప్రతి సోమవారం కన్నప్ప సినిమాలో నటించిన నటీనటులను రివీల్ చేస్తూ వాళ్ల పాత్రలను పరిచయం చేస్తు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే అక్షయ్ కుమార్, శరత్ కుమార్, మధుబాల, దేవరాజ్, ముఖేష్ రిషి, మంచు అవ్రామ్, అర్పిత్ రంకా, టిక్కి పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లు రిలీజ్ చేశారు. తాజాగా ఈ కన్నప్ప సినిమాలో నటిస్తున్న మరో సీనియర్ నటి ఐశ్వర్య ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. అంతేకాదు ఆమె నటించిన మారెమ్మ పాత్రను, చేసే పనిని రివీల్ చేశారు. అడవిని పీడించే ఆరాచకం.. మారెమ్మ.. కుతంత్రమే తన మంత్రం అంటూ ట్యాగ్ లైన్ తగిలించారు. ఈ లుక్‌లో ఐశ్వర్య చాలా భయంకరంగా, క్రూరంగా ఉంది. ఇప్పుడు ఈ పోస్టర్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. మంచు విష్ణు కలల సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు మహా భారతం సీరియల్ డైరెక్టర్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా డిసెంబర్‌లో ఈ సినిమా పాన్ ఇండియా వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# రవితేజ వారసులు.. తండ్రి కంటే భిన్నంగా..



మాస్ మహారాజ్ రవితేజ వారసులు మోక్షద, మహాధన్ తండ్రి బాటలోనే సినిమా ఇండస్ట్రీలోనే వారి కెరియర్ బిల్డ్ చేసుకునే పనిలో ఉన్నారు. అయితే తండ్రిలా యాక్టర్స్ గా మాత్రం ప్రయత్నం చేయడం లేదని తెలుస్తోంది. రవితేజ కూతురు మోక్షద వయస్సు ఇప్పుడు 21 ఏళ్ళు. ఆమె సొంతంగా బ్యానర్ స్టార్ట్ చేసి నిర్మాతగా అడుగులు వేయాలని అనుకుంటుందంట. ఇప్పటికే సితార ఎంటర్టైన్మెంట్స్ నాగవంశీ దగ్గర ప్రొడక్షన్ టెక్నిక్స్ గురించి తెలుసుకునే పనిలో మోక్షద ఉందని టాక్ వినిపిస్తోంది. అలాగే సితార ఎంటర్టైన్మెంట్స్ తో కలిసి ముందుగా కొన్ని చిన్న సినిమాలు నిర్మించాలని ప్లాన్ చేసిందని ప్రచారం నడుస్తోంది. అందులో భాగంగా శ్రీవిష్ణుతో మోక్షద నిర్మాతగా మొదటి సినిమా చేస్తుందని సమాచారం.నిజానికి రవితేజ ముందుగా తన కూతురు నిర్మాతగా మారడానికి అభ్యంతరం వ్యక్తం చేసిన ఫైనల్ గా ఒకే చెప్పారని టాక్. మరో వైపు రవితేజ తనయుడు మహాధన్ ప్రస్తుతం 18 ఏళ్ళ వయస్సులో ఉన్నాడు. తండ్రి బాటలో హీరో అవుతాడని అందరూ భావించారు. గతంలో రాజా ది గ్రేట్ సినిమాలో చిన్నప్పటి రవితేజగా అతను అద్భుతమైన నటన తో మెప్పించాడు. అయితే మహాధన్ కి ఇప్పుడు ఫోకస్ డైరెక్షన్ మీద ఇంటరెస్ట్ ఉందని టాక్. ముఖ్యంగా సందీప్ రెడ్డి వంగా మేకింగ్ స్టైల్ అంటే మహాధన్ కి ఇష్టం అంట. అందుకే స్ట్రాంగ్ రిఫరెన్స్ తో సందీప్ రెడ్డి వంగా దగ్గర అసిస్టెంట్ గా జాయిన్ అయ్యాడనే మాట వినిపిస్తోంది. రెండు, మూడు సినిమాలకి వర్క్ చేసిన తర్వాత దర్శకుడిగా ఎంట్రీ ఇవ్వాలని మహాధన్ ప్లాన్ చేసుకుంటున్నట్లు టాక్ నడుస్తోంది. అయితే కొందరు వారసులు మేకింగ్ మీదుగా అవగాహన తెచ్చుకున్న తరువాత నటులుగా మారుతున్నారు. బహుశా రవితేజ కొడుకు కూడా అలానే చేస్తున్నాడేమో. మొత్తానికి రవితేజ కొడుకు, కూతురు సినిమా ఇండస్ట్రీలోనే కెరియర్ బిల్డ్ చేసుకుంటున్నారు. ఇక రవితేజ కెరియర్ ఆరంభంలో అసిస్టెంట్ డైరెక్టర్స్ గా కొన్ని సినిమాలకి వర్క్ చేశాడు. తరువాత నటుడిగా మారి ఒక్కో మెట్టు ఎక్కుతూ ప్రస్తుతం స్టార్ హీరో రేంజ్ కి వచ్చాడు. ఇక రవితేజ కొడుకుని అతని ఫ్యాన్స్ హీరోగా చూడాలని అనుకుంటున్నారు. మరి ఫ్యాన్స్ కోరిక మేరకు అతను హీరోగా మారుతాడా లేదంటే దర్శకుడిగానే కెరియర్ కొనసాగిస్తాడా అనేది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే మాస్ మహారాజ్ రవితేజ ప్రస్తుతం భాను భోగవరపు దర్శకత్వంలో మూవీ చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. రవితేజకి గాయం కావడంతో ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాగే మరో ప్రాజెక్టుపై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613